www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

భద్రాద్రి జిల్లాలో భారీ వర్షాలు



7 లో..

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి..



5 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 276, గురువారం 5-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

హైదరాబాద్‌ను ఆదర్శ నగరంగా

తీర్చిదిద్దుతాం



- నగరాభివృద్ధికి యాదవుల సహకారం అవసరం
- మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణకు ప్రాధాన్యం
- సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా.. రూ.5 కోట్ల నిధులు
- యాదవుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ బాధ్యత నాదే: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 :

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి యాదవుల సంపూర్ణ సహకారం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదర, సోదరీమణులకు సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, ప్రాంతీయ వలయ రహదారి, భారత భవిష్యత్ నగరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఈ లక్ష్యాల సాధనలో అన్ని వర్గాల ప్రజలతో పాటు యాదవులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల కృషి ఎంతో ఉందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి యాదవ సోదరులు ఆప్యాయతతో ఆతిథ్యం ఇచ్చి ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధిలోనూ వారి పాత్ర కీలకమని అన్నారు. హైదరాబాద్‌కు జాతీయస్థాయిలో మంచి పేరు తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. యాదవుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని గుర్తుచేసిన రేవంత్‌రెడ్డి, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల విజ్ఞప్తి మేరకు సదర్ సమ్మేళనానికి రాష్ట్ర ఉత్సవ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసిందని వెల్లడించారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని గౌరవించడంతో పాటు వారి సామాజిక గుర్తింపును మరింత

మిగతా 2 లో..

సాంకేతిక ఆవిష్కరణలతో తెలంగాణకు కొత్త దిశ

- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- పరిశోధనలకు పరిశ్రమల సహకారం అవసరం
- యువతకు ఉపాధి.. ప్రజలకు అందుబాటు ధరల్లో సాంకేతిక ఫలాలు
- ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రంగా రాష్ట్రం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2 లో..

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే
- వచ్చే ఏడాదిలోగా ప్రతి అంగుళం భూమి కొలత
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు



మేడ్చల్, నవంబర్ 4

రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులను

మిగతా 2 లో..

హిందూ కళాశాలను ప్రైవేటుపరం చేస్తే

ఊరుకునేది లేదు

- విద్యార్థుల ఆందోళనకు కల్వకుంట్ల కవిత సంఘీభావం
- కేంద్రం స్పందించకుంటే ఉద్యమం ఉద్ధృతం
- చారిత్రక వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

న్యూఢిల్లీ, నవంబర్ 4 :

ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రతిష్ఠాత్మక హిందూ కళాశాలను ప్రైవేటు పరం చేసే ప్రయత్నాలను సహించబోమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



మిగతా 2 లో..



కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

రేవంత్‌ది పాలన కాదు.. ఢిల్లీ పర్యటనలే!

ప్రాజెక్టులు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై నిలదీత

మహేశ్వరం వైద్య కళాశాలలో వసతులపై రగడ

- విద్యార్థుల ఆందోళనకు హరీశ్‌రావు మద్దతు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి తీవ్ర విమర్శలు
- రెండు నెలల్లోగా భవనం మార్చాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం, నవంబర్ 4 :

మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో నెలకొన్న వసతుల సమస్యలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మాజీ మంత్రి హరీశ్‌రావు మద్దతు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంగళ్‌పల్లి వద్ద విద్యార్థులు నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కాబోయే వైద్యుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని



మండిపడ్డారు. కళాశాలలోని పరిస్థితులు పశువుల కొట్టం కంటే అధ్వాన్నంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

మిగతా 2 లో..

ఢిల్లీ పార్టీలకు తెలంగాణ ఆత్మగౌరవం

తాకట్టు పెట్టిన రేవంత్

హైదరాబాద్, నవంబర్ 4

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర హక్కులను ఢిల్లీ నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్న కాంగ్రెస్, బీజేపీల తీరు ఒకేలా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ నాయకులు రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ రాజకీయ అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రికి దక్కుతున్న గౌరవం ఏమిటో ఈ పరిణామం తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నమస్కరించిన తీరుపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. బండి సంజయ్ అమిత్ షా ముందు భద్రతా సిబ్బందిలా వ్యవహరించారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల ముందు తగ్గించుకు విధంగా రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను పక్కనపెట్టి

మిగతా 2 లో..

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
గురువారం
5 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

హైదరాబాద్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. సదర్ ఉత్సవాలు రాష్ట్ర సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.దేశంలోనే తొలిసారిగా కులగణన చేపట్టి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏ సామాజిక వర్గం జనాభా ఎంత ఉందో తెలుసుకుని, అందుకు అనుగుణంగా అవకాశాలు, వాటాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. యాదవులకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా నియమించడంతో పాటు గోశాల బాధ్యతలను కూడా అప్పగించినట్లు వెల్లడించారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఏకే యాంటోనీ కుమార్, మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యాదవ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఉత్సవానికి హాజరయ్యారు. దేశంలోని పలు ప్రాంతాల నాయకులు ఒకే వేదికపైకి రావడంతో సదర్ సమ్మేళనానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. యాదవుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు.

హిందూ కళాశాలను ప్రైవేటుపరం చేస్తే ఊరుకునేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

కళాశాల ప్రత్యేక వారసత్వాన్ని,గుర్తింపును కాపాడాలంటూ గత నెలన్నర రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నిర్వహిస్తున్న ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని హిందూ కళాశాలకు వెళ్లి నిరసన చేస్తున్న విద్యార్థులను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థ ఎంతోమంది మేధావులను దేశానికి అందించిందని, దాని ప్రత్యేకతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు.

ప్రైవేటు సంస్థలు కళాశాల నిర్వహణకు నిధులు సమకూరుస్తున్నాయనే కారణంతో దాని నిర్వహణ బాధ్యతలను పూర్తిగా వాటికి అప్పగించాలని చూడటం సరికాదని కవిత అన్నారు. నిధుల సాయాన్ని అందించడం వేరు, విద్యాసంస్థపై యాజమాన్య హక్కులు కల్పించడం వేరని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాల మంజూరు సంఘం నిబంధనల ప్రకారం విరాళాలు అందించే ప్రైవేటు సంస్థలకు పరిమిత మైన సౌకర్యాలు మాత్రమే కల్పించాలని సూచించారు. నిధుల పేరుతో చారిత్రక కళాశాలను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థల చేతుల్లో పెట్టే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల స్వతంత్రత, విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతినకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నెలన్నరగా ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కవిత ప్రశ్నించారు. విద్యార్థులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.కళాశాల ప్రవేశాల ప్రక్రియలో జరుగుతున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్న అవకతవకలు, కళాశాలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలపై వారు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇంతకాలంగా నిరసనలు కొనసాగుతున్నా సంబంధిత వర్గాలు మౌనంగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్ల పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

విద్యార్థుల గొంతును అణచివేయాలని ప్రయత్నిస్తే ఆందోళనలు మరింత తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని కవిత అన్నారు. న్యాయబద్ధమైన ప్రతి పోరాటానికీ తాను మద్దతుగా నిలుస్తానని, హిందూ కళాశాల విద్యార్థులు చేస్తున్న ఉద్యమం సమంజసమైనదని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థల పరిరక్షణ కోసం విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి ఆందోళనలను కేవలం నిరసనలుగా చూడకుండా, వాటి వెనుక ఉన్న సమస్యలను అర్థం చేసుకోవాలని కేంద్రానికి సూచించారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.

హిందూ కళాశాల చారిత్రక ప్రాధాన్యతను, విద్యా రంగానికి అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని దాని ప్రత్యేక గుర్తింపును కాపాడాలని కవిత కేంద్రాన్ని కోరారు. విద్యార్థులు, అధ్యాపకులు లేవనెత్తిన అంశాలపై తక్షణమే స్పందించి, ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే విద్యార్థుల ఉద్యమానికి మరింత విస్తృతంగా మద్దతు తెలుపుతామని, ఆందోళనను ఉద్ధృతం చేసే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, విద్యాసంస్థల పరిరక్షణ కోసం తాము అండగా ఉంటామని మరోసారి స్పష్టం చేశారు.

మహేశ్వరం వైద్య కళాశాలలో వసతులపై రగడ

(మొదటి పేజీ తరువాయి)

గత 26 నెలలుగా విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, కళాశాల భవనం అద్దె కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయలతో మూసీ అభివృద్ధి, భవిష్యత్ నగరం వంటి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వైద్య కళాశాల విద్యుత్, నీటి బిల్లులు చెల్లించడానికి నిధులు లేవా అని ప్రశ్నించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, అమెరికా, చైనాతో పోటీ పడతామని చెబుతున్న పాలకులు ముందుగా విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. కళాశాలలోని దుస్థితిని చూస్తుంటే అభివృద్ధి మాటలు వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉన్నాయని విమర్శించారు. సామాన్యుల ఇళ్లకు ఆక్యుపెన్సీ ధ్రువపత్రం లేదనే కారణంతో కూల్చివేతలు చేపట్టే ప్రభుత్వం, అవసరమైన అనుమతులు, అగ్నిమాపక భద్రత లేని భవనంలో మూడేళ్లుగా వైద్య కళాశాలను ఎలా నిర్వహిస్తోందని హరీశ్‌రావు నిలదీశారు. కళాశాల పరిసరాల్లో పాములు, పందులు, కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయని స్వయంగా ప్రిన్సిపాల్ లేఖ రాసినా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను కూడా పట్టించుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. కళాశాల నిర్మాణం కోసం గతంలో కేసీఆర్ 25 ఎకరాల స్థలం కేటాయించి, రూ.182 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేసినప్పటికీ, మూడేళ్లలో నిర్మాణ పనులు ముందుకు సాగలేదని విమర్శించారు.కళాశాల భవనం ఎక్కడ నిర్మించాలనే అంశంపై మూడేళ్లయినా స్పష్టత రాకపోవడం సిగ్గుచేటని, వైద్య విద్య సంచాలకులే ఈ విషయాన్ని చెబుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను రాత్రికి రాత్రే గృహనిర్బంధం చేసే నిఘా వ్యవస్థ, మూడు రోజులుగా విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన పాలనను తానే గొప్పగా చెప్పుకుంటున్నారని, కానీ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సనత్‌నగర్‌లోని వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రిని కూడా అవసరమైన వైద్య సదుపాయాలు, శస్త్రచికిత్స గదులు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, వైద్య విద్య సంచాలకులు తక్షణమే కళాశాల వద్దకు వచ్చి విద్యార్థులతో చర్చించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై రాతపూర్వక హామీ ఇవ్వాలని, రెండు నెలల్లోగా మహేశ్వరం వైద్య కళాశాలను అన్ని రకాల వసతులు కలిగిన భవనంలోకి మార్చాలని కోరారు. విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం ఇకనైనా తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాల నిర్మాణం, ప్రస్తుత భవనంలోని సౌకర్యాలు, విద్యార్థుల భద్రతపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి హామీలు అమలు చేసే వరకు విద్యార్థుల సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణలతో తెలంగాణకు కొత్త దిశ

హైదరాబాద్, నవంబర్ 4 : తెలంగాణను ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ అత్యాధునిక సాంకేతిక నాయకత్వ సదస్సులో ఆయన పాల్గొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరైన భట్టి విక్రమార్క రాష్ట్ర భవిష్యత్తు ఆర్థిక ప్రగతి, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, పెట్టుబడుల అవకాశాలపై మాట్లాడారు. 203435 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను లక్ష కోట్ల డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



ఈ లక్ష్యాలను సాధించడంలో అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పరిశోధన, అభివృద్ధి రంగాల్లో మరింత ప్రగతి సాధించడంతో పాటు కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధనలు, జీవ సాంకేతికత, అధునాతన తయారీ వంటి రంగాల్లో వస్తున్న మార్పులు భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే ఉన్న పరిశ్రమల వాతావరణం, నైపుణ్యం కలిగిన యువత, విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలను సమన్వయం చేస్తూ కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు.

పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే సాంకేతిక ఆవిష్కరణలు ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారుతాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ప్రయోగశాలలకే పరిమితమయ్యే పరిశోధనలు క్షేత్రస్థాయికి చేరాలని, ముఖ్యంగా సామాన్య ప్రజలు, రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంచడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, రోజువారీ జీవితాన్ని సులభతరం చేయడం వంటి అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలన్నారు. ఆవిష్కరణల ఫలాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకూ చేరాలని స్పష్టం చేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించే పురోగతి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు ప్రజలకు అందుబాటు ధరల్లో ప్రయోజనాలను అందించాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు రూపొందించడం, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అవసరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక రంగాల మధ్య అనుసంధానం పెరిగితే రాష్ట్రం సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ సదస్సులో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, పరిశోధకులు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడే కొత్త ఆలోచనలు, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలకు ఈ సదస్సు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధనా రంగం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషితోనే నిర్దేశించుకున్న ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచగలమని భట్టి విక్రమార్క తెలిపారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు వివాదరహితమైన భూములను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో భద్రతతో కూడిన భూ రికార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.

బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గృహనిర్మాణ అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా సమగ్ర భూ సర్వేను వేగంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఇప్పుడు నేరుగా జిల్లాలకు వచ్చి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందితో సమస్యలను చర్చిస్తున్నామని వివరించారు. సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజల అభ్యంతరాలు, పెండింగ్ దరఖాస్తులపై స్పష్టమైన సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు.

సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు కనీసం వారానికి ఒకరోజు సర్వే జరుగుతున్న గ్రామాలను సందర్శించాలని సూచించారు. మండలస్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను దాచిపెట్టకుండా ఉన్నది ఉన్నట్లుగా వివరించాలని, ప్రభుత్వ అనుమతులు లేదా మార్గదర్శకాలు అవసరమైన అంశాలను స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని పొంగులేటి పేర్కొన్నారు. ఈ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాదని, సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం చూపుతుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని, ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరవై రెండో అధికరణకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని అంశాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న సమగ్ర భూ సర్వే విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సమక్షంలోనే భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ చేపట్టి వారి అభ్యంతరాలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీలకు తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు పెట్టిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)



తరచూ ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తున్నారని, రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం, నిధులు తీసుకురావడం, అభివృద్ధి ప్రాజెక్టులను సాధించడం కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సంచులు మోస్తే, బీజేపీ చెప్పులు మోస్తోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చి వెళ్లినప్పటికీ రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు అయినా తీసుకురాలేదని ప్రశ్నించారు. మెట్రో విస్తరణ, జాతీయ ప్రాజెక్టులు, జాతీయ స్థాయి విద్యాసంస్థల విషయంలో కేంద్రం నుంచి తెలంగాణకు ఏమి లభించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో వ్యవహరిస్తూ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నీరు అందుబాటులో ఉన్నా రైతులకు, ప్రజలకు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. బొగ్గు ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేయలేని దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.రైతులు, మహిళలు, పేదలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు సహా అన్ని వర్గాలూ ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

హైదరాబాద్‌లో మళ్లీ తాగునీటి, విద్యుత్ సమస్యలు తలెత్తడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. నగరానికి నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులను నిర్మించిందని గుర్తుచేశారు.భవిష్యత్తులో నగర జనాభా పెరిగినా నీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసిందన్నారు.ప్రస్తుతం తాగునీటి సమస్యలు మళ్లీ తలెత్తడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. మియాపూర్‌లో 550 ఎకరాల భూముల విక్రయానికి ప్రభుత్వం ఎందుకు తొందరపడుతోందని ప్రశ్నించారు. భూముల విక్రయం వెనుక ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను ప్రస్తావిస్తూ, కేసీఆర్ లక్షల సంఖ్యలో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించారని, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క ఇల్లయినా నిర్మించిందా అని నిలదీశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వాన్ని చూసే ప్రజలు గతంలో బీఆర్ఎస్‌కు ఓటు వేశారని, రేవంత్‌రెడ్డిని చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయలేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని, కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన నాయకుడు అవుకు దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

వర్షాన్ని లెక్కచేయని ఆర్యవైశ్యుల ఐక్యతా సందడి!

- ఇల్లందులో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌కు ఘన స్వాగతం

- సేవా కార్యక్రమాలపై ప్రశంసల జల్లు.. ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

వర్షం కురుస్తున్నా.. సేవా సంకల్పం ముందు వాన సైతం చిన్నబోయింది. ఆర్యవైశ్యుల ఐక్యతకు ఇల్లందు వేదికగా నిలిచింది. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శిద్ధా వెంకట సూర్య ప్రకాశరావు గుడ్‌విల్ విజిట్ సందర్భంగా ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యుల నుంచి విశేష స్పందన లభించింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు. ముందుగా హరిహర క్షేత్రానికి చేరుకున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌కు ఆలయ చైర్మన్ ఆర్. మంజుల, ఈఓ సి.హెచ్. రామకోటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టు చీర, ఆభరణాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు, రైతుకు ఛార్జింగ్ స్ప్రే పంపు, ఆలయ సహాయక సిబ్బందికి చీరలు పంపిణీ చేసి సేవా నిరతిని చాటుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ

అనంతరం ఇల్లందు మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్న అతిథులకు వాసవి క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కలర్ పార్టీ, బ్యాండ్ పార్టీతో ఘన స్వాగతం పలికారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆవిష్కరించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు వాసవి క్లబ్ అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య దాతలుగా వ్యవహరించారు. ఇల్లందు బొగ్గు గనులకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేస్తూ, బొగ్గు గని కార్మికుల భద్రతకు ప్రతీకగా సేఫ్టీ లైట్, టోపీ, చమ్మాస్‌ను జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్ అందజేశారు. విద్యార్థుల అత్యవసర వైద్య అవసరాల నిమిత్తం మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించారు. అత్యవసర పని నిమిత్తం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ తదుపరి కార్యక్రమాల బాధ్యతలను రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్‌కు అప్పగించి వెళ్లారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు.. ప్రతిభకు పట్టాభిషేకం

రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వస్త్రాలు, పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు, ఎస్ఏ-1 పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి మెమెంటోలు అందజేశారు. పాఠశాల సహాయక సిబ్బందికి చీరలు, విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. "మీ సేవా కార్యక్రమాలు అద్భుతం" అంటూ నిర్వాహకులను ప్రశంసించారు.

ప్రముఖుల సందడి.. ఐక్యతకు ప్రతీకగా కార్యక్రమం

ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ దరిసి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఎ-106లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీలు చింతల వినోద్, రేపాక రాజ మనోహర్, ఉడతా నగేష్ కుమార్, రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్, రీజినల్ సెక్రటరీ అలేఖ్య, ఐపీసీ శీమకుర్తి రాజ మనోహర్ పాల్గొన్నారు. అలాగే ఇల్లందు వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్ చిదిరాల లింగయ్య, ఐపీసీలు వ్యామసాని జనార్దన్, అర్వపల్లి రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీలు పుల్లూరు సతీష్ కుమార్, జొన్నల ఉపేందర్ నాథ్ గుప్తా, డీపీఓలు యెలుగురి మధుబాబు, సైఫా రాజశేఖర్, జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు, కోశాధికారి బోనగిరి రమేష్, వనిత క్రౌన్ కోశాధికారి సముద్రాల ఉషారాణి, ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగురి నగేష్ కుమార్, ఇల్లందు మండల అధ్యక్షుడు పాబోలు మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు. తాటిపల్లి సుబ్బారావు, గౌరిశెట్టి కృష్ణ, దొడ్డి రాజు, కటకం సత్యనారాయణ, తీర్దాల వెంకటేశ్వర్లు, కటకం సుమన్, జంగాల హరీష్, అర్వపల్లి రాజేష్, కటకం రేణుకాదేవి, బోనగిరి కల్పన, చిక్కా త్రివేణి, కటకం ప్రణవి, కటకం కళావతి, మాశెట్టి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాలు, ఉపాధ్యాయులు, హరిహర క్షేత్రం ధర్మకర్తల మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, చేరుకుమాళ్ల శంకర్, నాళ్ల సురేష్ కుమార్, బొల్లి శబరీష్ కుమార్, బత్తుల చెంచమ్మ, బండారు రాఘవాచారి, వల్లాల మణికంఠ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆర్యవైశ్య సోదర సోదరీమణుల ఐక్యత, వాసవి క్లబ్, వనిత క్రౌన్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు పట్టణ ప్రజల ప్రశంసలు అందుకున్నాయి.

"చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్‌ను ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ"



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ బుధవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ చెకుముకి టాలెంట్ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్వి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల నాగేందర్ , రాష్ట్ర కమిటీ సభ్యులు శివ నారాయణ ,జిల్లా కమిటీ సభ్యులు తాతా రాఘవయ్య , బంధం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతే తొలి వెలుగు..

- దీపావళిపై త్రివేణి విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అవగాహనలి



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4(భద్రాద్రిన్యూస్) :- దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు పూర్తి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్ ఫైటర్ పి. కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాణసంచా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయనతో పాటు ఫైర్ సిబ్బంది పి. భాస్కర్ రావు, జి. అశోక్, కె. సాయినికేష్ పాల్గొని పలు సూచనలు చేశారు. టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణ ఉండాలని, తగినంత దూరం పాటించాలని, చేతిలో పెట్టుకుని బాణసంచా కాల్చకూడదని, కాటన్ దుస్తులు ధరించాలని, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే వెంటనే స్పందించేందుకు నీటి బకెట్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు పండుగలను ఆనందంతో పాటు బాధ్యతాయుతంగా, భద్రతా నియమాలు పాటిస్తూ జరుపుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమంలో నేర్చుకున్న భద్రతా సూచనలను తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థుల్లో అగ్నిప్రమాదాల నివారణ, బాణసంచా భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా సాగిందని పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనను విరమించుకోవాలి

- అత్యంత వెనుకబడిన కులాలకు అన్యాయం జరుగుతుంది..

ప్రభుత్వానికి బురహన్‌పురం గంగపుత్ర సంఘం విజ్ఞప్తి

- కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం..

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామన్న హామీలపై తీవ్ర అభ్యంతరం

ఖమ్మం, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏ (BC-A) జాబితాలో చేర్చకూడదని బురహన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘం నూతన కమిటీ తొలి కార్యవర్గ సమావేశం బుధవారం అధ్యక్షుడు జీజుల శంకరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చుతామని రాష్ట్ర ప్రభుత్వంలోని పలువురు నాయకులు ఇస్తున్న హామీలు, వాగ్దానాలను కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే బీసీ-ఏ జాబితాలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చినట్లయితే ప్రస్తుతం ఆ జాబితాలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలు విద్య, ఉద్యోగ, ఇతర అవకాశాల్లో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు జీజుల శంకరయ్య, కార్యదర్శి పెద్దపల్లి సుధాకర్, కోశాధికారి డోలి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు పెద్దపల్లి సోమయ్య, గౌరవ సలహాదారు పాకాల ఉపేందర్, ఉపాధ్యక్షుడు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మురుసు తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి: మాజీ ఎంపీ నామ

- పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలి: మాజీ ఎంపీ నామ

- నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి: మాజీ ఎంపీ నామ

- రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి: మాజీ ఎంపీ నామ

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):



మురుసు తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఇతర సాగు పంటలు తీవ్రంగా దెబ్బతినడం పట్ల బీఆర్ఎస్, మాజీ లోక్ సభ పక్ష నేత ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు వర్షాల కారణంగా నీటమునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టాన్ని అంచనా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును గుర్తించి, నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రకృతి వైపరీత్యం మరింత నష్టాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి, వారికి అండగా నిలవాలని నామ కోరారు.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

Follow :
@bhadradrinews

గురువారం
5 । నవంబర్ । 2026

www.bhadradrinews.com
epaper.bhadradrinews.com

ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

పేదల ఆరోగ్యమే లక్ష్యంగా పల్లా కిరణ్ సేవా యజ్ఞం!

- పల్లా జాన్ రాములు 88వ జయంతి సందర్భంగా భారీ ఉచిత వైద్య శిబిరం

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన వెయ్యి మందికి పైగా నిరుపేదలు..

300 మందికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): పేదల పక్షపాతిగా, పీడిత ప్రజల గొంతుకగా నిలిచి, జీవితాంతం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ పల్లా జాన్ రాములు 88వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, ప్రముఖ సామాజిక సేవకుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత జనరల్ వైద్య, కంటి వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. స్థానిక ఖమ్మం మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని డోర్నకల్ బిషప్ ఆర్టీ రెవరెండ్ డాక్టర్ కె. సేనం రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో నిరుపేదలు శిబిరానికి తరలివచ్చారు. ఈ శిబిరంలో వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. అదేవిధంగా 300 మందికి పైగా నిరుపేదలకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ కె. సేనం రాజు మాట్లాడుతూ స్వర్గీయ పల్లా జాన్ రాములు పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతున్న పల్లా కిరణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ విశ్వం, జి. ప్రభాకర్ రావు, రెవరెండ్ బి. శ్రీనివాస్ పాల్, రెవరెండ్ ఇశ్రాయేల్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్లయ్య, చిలకబత్తిని కనకయ్య తదితరులు పాల్గొని పల్లా కిరణ్‌ను ఆశీర్వదించారు. వైద్యులైన డాక్టర్ రఘు, డాక్టర్ సృజన్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ హరికృష్ణ, గంట కిరణ్‌తో పాటు పల్లా కిరణ్ యూత్ సభ్యులు శిబిరం విజయవంతానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కరోనా సమయంలో 3,000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ చేయడంతో పాటు ప్రైవేటు ఉపాధ్యాయులు, పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించినట్లు వివరించారు. వరదల సమయంలో బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. నిరుపేద విద్యార్థుల ప్రాథమిక, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సొంత ఖర్చులతో బోర్లు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, అనాథ బాలబాలికలు, యువతకు వివిధ రూపాల్లో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం సంతృప్తినిస్తోందని పల్లా కిరణ్ పేర్కొన్నారు. తన తండ్రి పల్లా జాన్ రాములు చూపిన సేవా మార్గంలో నడుస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

అవినీతి తిమింగలం సస్పెన్షన్

- ముదిరాజ్ సమాజంలో వెల్లువలాంటి హర్షం!

- నకిలీ జీవోలు, బోగస్ సభ్యత్వాల దందాకు అడ్డుకట్ట వేసిన ప్రభుత్వం..

- పేద మత్స్యకారుల పొట్టకొట్టిన అవినీతి అధికారిపై ముదిరాజ్ సంఘం తీవ్ర ఆగ్రహం..

- త్వరితగతిన చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు..

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):- మత్స్యశాఖలో సుదీర్ఘకాలంగా తిష్టవేసి, అధికార బలంతో పేద మత్స్యకారుల రక్తాన్ని పిండిన అవినీతి అధికారి ఆంజనేయ స్వామి పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడం పట్ల రాష్ట్ర, జిల్లా ముదిరాజ్ సంఘం తీవ్ర హర్షం వ్యక్తం చేసింది.. అవినీతి అధికారి సస్పెండ్ అయిన వార్త తెలియగానే రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చోప్పరి శంకర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ముదిరాజ్ కుల పెద్దలు, సంఘం ప్రతినిధులు ఒకేతాటిపై కూర్చొని అవినీతి అధికారి అక్రమాల సామ్రాజ్యాన్ని ఎండగట్టారు..

లంచాల పిశాచి.. నకిలీల సూత్రధారి..

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ... సస్పెండ్ అయిన అధికారి ఒక లంచాల పిశాచిలా ప్రవర్తించాడని మండిపడ్డారు.. కేవలం కోమట్లగూడెం సొసైటీకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా వందలాది నకిలీ సభ్యత్వాలను సృష్టించి సాంప్రదాయక వృత్తి నైపుణ్యం లేని అనర్హులకు చెరువులను కట్టబెట్టాడని ధ్వజమెత్తారు.. ఏకంగా ప్రభుత్వ ఉన్నత ఉత్తర్వులను (జీఓస్) సైతం ఫోర్జరీ చేసి, బోగస్ ప్రొసీడింగ్స్ తయారు చేసిన ఇలాంటి ఘోరమైన అవినీతి అధికారి వల్ల ఎంతోమంది నిజమైన ముదిరాజ్ బిడ్డలు ఆకలితో అలమటించారని, సొసైటీల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకున్నాడని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు పాపం పండి ఈ అవినీతి తిమింగలం ఇంటికి చేరిందని వారు ఎద్దేవా చేశారు.

ప్రభుత్వానికి జేజేలు.. శ్రమజీవుల పక్షపాతి ఈ ప్రభుత్వం..

పేద మత్స్యకారుల ఆవేదనను, తాము అందించిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే స్పందించిన ప్రభుత్వంపై ముదిరాజ్ కులస్థులు ప్రశంసల వర్షం కురిపించారు.. అక్రమార్కుడిని ఉపేక్షించకుండా, సస్పెన్షన్ వేటు వేసి ప్రభుత్వం తన నిజాయితీని, ప్రజాపక్షపాత వైఖరిని చాటుకుందని కొనియాడారు.. "శ్రమ నమ్ముకున్న ముదిరాజ్ బిడ్డలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ నిర్ణయంతో రుజువైంది" అని హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి సాహసోపేతమైన, న్యాయమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కి, మత్స్యశాఖ మంత్రి ఖమ్మం ఇన్చార్జి వాకటి శ్రీహరి కి, ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విచారణను వేగవంతం చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులకు, (కమిషనర్ కి) ముదిరాజ్ సమాజం తరపున శిరస్సు వంచి హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు..



బోగస్ సభ్యత్వాలు పూర్తిగా రద్దు చేయాలి..

సస్పెన్షన్ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, అవినీతి అధికారి జిల్లా అంతటా సృష్టించిన అన్ని నకిలీ జీవోలను, బోగస్ సభ్యత్వాలను తక్షణమే రద్దు చేసి స్క్రీనింగ్ కమిటీ ద్వారా నిజమైన మత్స్యకారులకే చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేసినందుకు అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ ఆస్తులను జప్తు చేయాలని కోరారు. పేదల పొట్టకొట్టే అధికారులకు ఈ సస్పెన్షన్ ఒక బలమైన హెచ్చరిక కావాలని ముదిరాజ్ సంఘం స్పష్టం చేసింది. ఈ విలేకరుల సమావేశంలో మన ముదిరాజు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోప్పెర వెంకట నరసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్రతానపు వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పెర జానకి రాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొమ్ము భాస్కర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు, మత్స్యశాఖ కన్వీనర్ బొమ్మకంటి సైదులు ముదిరాజ్, ఉపాధ్యక్షులు చింతనబోయిన సీతారాములు ముదిరాజ్, దంతాల కేశవులు ముదిరాజ్, గొడుగు నాగేశ్వరరావు ముదిరాజ్, బండారి శ్రీను ముదిరాజ్, కోశాధికారి ఓర వెంకటేశ్వర్లు ముదిరాజ్, కార్యదర్శులు పందుల ఉపేందర్ ముదిరాజ్, చామకూరి నాగేశ్వరరావు ముదిరాజ్, గోగుల శ్రీను ముదిరాజ్, నర్ల శేషయ్య ముదిరాజ్, కోమట్లగూడెం మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు బుడిగె వెంకటేశ్వర్లు ముదిరాజ్, అడపా ప్రవీణ్ ముదిరాజ్, వివిధ మండలాల ప్రతినిధులు, బాధిత మత్స్యకార సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉద్యోగ సంఘాల రాష్ట్ర నేతలకు ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారుల ఫోరమ్ ఘన సత్కారం!

- హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘాల నాయకులను మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా ప్రతినిధులు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ అధికారుల సంఘం కేంద్ర వేదిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులను ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారుల వేదిక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సత్కరించారు. సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, తెలంగాణ ప్రభుత్వ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లను ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారుల వేదిక ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దినేని రాధాకృష్ణ, ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారుల వేదిక అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి ఎన్. నాగేశ్వరరావు, కోశాధికారి కె. తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు ఎస్. వెంకటరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆర్. నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు శుభవార్త..

- ఇంటి వద్ద నుంచే డిజిటల్ జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పణకు అవకాశం!

- నవంబర్ 5, 6 తేదీల్లో రుద్రంపూర్‌లో ప్రత్యేక అవగాహన శిబిరం

- సింగరేణి సహకారంతో ఉచితంగా జీవన్ ప్రమాణ్ సేవలు..

- పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలి

- సీఎంపీఎఫ్ ఆర్గనైజేషన్ కొత్తగూడెం రీజనల్ కమిషనర్



కొత్తగూడెం, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): సింగరేణి పెన్షనర్లు ప్రతి సంవత్సరం తమ జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించుకునే విధానంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర గనుల భవిష్య నిధి సంస్థ ప్రాంతీయ కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డిజిటల్ జీవిత ధ్రువీకరణ పత్రాల ప్రచార కార్యక్రమం 5.0లో భాగంగా నవంబర్ 5, 6 తేదీల్లో కొత్తగూడెం ఏరియా సింగరేణి సంస్థ సహకారంతో రుద్రంపూర్‌లోని సీ-ఈఆర్ క్లబ్‌లో ఈ అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జీవన్ ప్రమాణ్ ద్వారా జీవిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించని వారు, అలాగే ఈ విధానంపై మరింత అవగాహన పొందాలనుకునే పెన్షనర్లు ఈ శిబిరంలో ఉచితంగా తమ జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించుకోవచ్చని సీఎంపీఎఫ్ ఆర్గనైజేషన్ కొత్తగూడెం రీజనల్ కమిషనర్ తెలిపింది.

కావలసిన ధ్రువపత్రాలు:

శిబిరానికి హాజరయ్యే పెన్షనర్లు కింది పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలి.

ఆధార్ కార్డు (ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ అందుబాటులో ఉండాలి). పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు (పీపీఓ) నంబర్. సీఎంపీఎఫ్ ఖాతా లేదా క్లెయిమ్ నంబర్. పెన్షన్ జమ అయ్యే బ్యాంకు ఖాతా పుస్తకం. ఈ పత్రాలతో శిబిరానికి వచ్చిన పెన్షనర్ల మొబైల్ ఫోన్లలో జీవన్ ప్రమాణ్ యాప్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా డిజిటల్ జీవిత ధ్రువీకరణ పత్రాన్ని ఎలా సమర్పించాలో ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తారు. తద్వారా భవిష్యత్తులో పెన్షనర్లు ఎవరి సహాయం లేకుండానే తమ ఇంటి వద్ద నుంచే సులభంగా జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించుకునే అవకాశం కలుగుతుంది. ప్రతి సంవత్సరం నవంబర్‌లో తప్పనిసరిగా జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించడం ద్వారా పెన్షన్ చెల్లింపుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రతినెలా పెన్షన్ సొమ్మును తమ బ్యాంకు ఖాతాల్లో పొందవచ్చని అధికారులు సూచించారు. కావున సింగరేణి పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవంబర్ 5, 6 తేదీల్లో రుద్రంపూర్ సీ-ఈఆర్ క్లబ్‌లో నిర్వహించే శిబిరానికి అధిక సంఖ్యలో హాజరై డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని సీఎంపీఎఫ్ సంస్థ కొత్తగూడెం ప్రాంతీయ కమిషనర్ కోరారు.

టైగర్ నల్లా నరసింహులు స్ఫూర్తితో ..

బి.సి వాటా సాధిద్దాం

భద్రాద్రి న్యూస్, కాలమిస్ట్ :

పోరాటమే జీవితంగా సాగిన ప్రజా యోధుడు అణచివేతపై తిరుగుబాటు చేసిన తెలంగాణ విప్లవ సింహం నల్లా నర్సింహులు నేటి బి.సి ఉద్యమాలకు స్ఫూర్తిగా మారాల్సిన అవసరముంది. చరిత్ర అనేది కేవలం రాజులు, రాజ్యాలు, అధికార పీఠాల కథ కాదు. అన్యాయాన్ని ఎదిరించి, అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం తమ జీవితాలనే పోరాట బాటలో అంకితం చేసిన సామాన్యుల అసామాన్య చరిత్ర కూడా ఉంది. అలాంటి పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన పేరు నల్లా నరసింహులు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ఆయన ఒక ధైర్యానికి ప్రతీక. నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచిన తెగువకు నిదర్శనం. పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత పోరాట యోధుడు.

పేదరికం నుంచి పోరాట పంథా వరకు...

1926 అక్టోబర్ 2న అప్పటి జనగామ తాలూకాలోని కడవెండి గ్రామంలో నల్లా లచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు జన్మించిన నల్లా నరసింహులు నిరుపేద పద్మశాలి చేనేత కుటుంబం ఆయనది. ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ, జీవిత పాఠాలు ఆయనకు సమాజాన్ని చదివే విజ్ఞానాన్ని అందించాయి. ఆ రోజుల్లో తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతోంది. దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ, రజాకార్ల దౌర్జన్యాలు పేద ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. కడవెండి గ్రామం కూడా విసునూరు దేశ్‌ముఖ్ ఆధిపత్యంలో అణచివేతకు గురవుతోంది. తన కళ్లముందు పేదలపై జరుగుతున్న అన్యాయాలు, తన కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, ముఖ్యంగా తండ్రి భూస్వామ్య దౌర్జన్యాలకు బలికావడం ఆయనలో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించాయి. అప్పటివరకు సామాన్య చేనేత కార్మికుడిగా ఉన్న నరసింహులు, అన్యాయాన్ని ప్రశ్నించే ప్రజా ఉద్యమకారుడిగా మారారు.

ఆంధ్ర మహాసభతో నల్లా నరసింహులు ఉద్యమ ప్రస్థానం

తెలంగాణ ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందించడంలో ఆంధ్ర మహాసభ కీలక పాత్ర పోషించింది. భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ ప్రభావంతో నరసింహులు ప్రజా ఉద్యమంలో మరింత చురుకుగా పాల్గొన్నారు. గ్రామగ్రామాన ప్రజలను సంఘటితం చేయడం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా చైతన్యం కల్పించడం, భూస్వాముల దౌర్జన్యాలను ప్రశ్నించడం ఆయన ఉద్యమ జీవితంలో ప్రధాన భాగాలయ్యాయి. తన జీవిత సహచరి వజ్రమ్మను కూడా ఉద్యమంలో భాగస్వామిని చేశారు. కుటుంబ బంధాలకంటే ప్రజా విముక్తి లక్ష్యమే గొప్పదని భావించి, ఇద్దరూ అజ్ఞాత జీవితాన్ని ఎంచుకున్నారు. గ్రామ దళాల నిర్మాణం, ప్రజలకు శిక్షణ, మహిళల్లో పోరాట చైతన్యం పెంపొందించడం వంటి కార్యక్రమాల్లో నరసింహులు కీలక పాత్ర పోషించారు. నల్లా నర్సింహులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరుగని వీరోచిత పాత్ర పోషించారు



1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయం. దొడ్డి కొమురయ్య అమరత్వంతో మరింత ఉధృతమైన ఈ పోరాటంలో నల్లా నరసింహులు జనగామ ప్రాంత దళ నాయకుడిగా ఎదిగారు. దున్నేవాడికే భూమి కావాలని **వెట్టిచాకిరీ అంతం కావాలని** దోపిడీ, దౌర్జన్యాలకు స్వస్తి పలకాలననే ఆశయాలు ఆయన పోరాటానికి ప్రధానంగా ప్రేరణనిచ్చినవి. గ్రామీణ పేదలను సంఘటితం చేస్తూ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని విస్తరించారు. ప్రజల ఆత్మగౌరవం, భూమి హక్కులు, సామాజిక సమానత్వం కోసం తన సహచరులతో కలిసి పోరాటాన్ని కొనసాగించారు. ఆయన నాయకత్వంలో దళాల నిర్మాణం, గెరిల్లా పోరాట వ్యూహాలు, ప్రజా రక్షణ కార్యక్రమాలు విస్తరించాయి.

నరసింహులు పేరు వినగానే నిరంకుశ పాలకులకు, వారి అనుచరులకు వణుకు పుట్టేది. ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు గుర్తింపుగా 'తెలంగాణ టైగర్' అనే బిరుదు స్థిరపడింది. నల్లా నర్సింహులుది ఉరికంబం ఎదురైనా వెనుకడుగు వేయని ధైర్యం. ఒక వ్యక్తి తన ప్రాణాలను కాపాడుకోవడం కోసం పోరాటాన్ని వదిలిపెట్టవచ్చు. కానీ నరసింహులు తన ప్రాణాలకంటే ప్రజల హక్కులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన జీవితంలో అరెస్టులు, చిత్రహింసలు, జైలు జీవితం, న్యాయస్థానాల్లో కేసులు నిత్యకృత్యాలయ్యాయి. అనేక కేసులను ఎదుర్కొన్నారు. ఏకంగా మూడుసార్లు మరణశిక్షను ఎదుర్కొన్నారు. అయినా ఆయన ధైర్యం సడలలేదు. న్యాయస్థానాల్లోనూ తన రాజకీయ, సామాజిక భావజాలాన్ని ధైర్యంగా వినిపించారు. ఒక సామాన్య చేనేత కుటుంబంలో పుట్టిన వ్యక్తి, నిరంకుశ పాలనను ఎదిరించి, ఉరికంబాన్ని సైతం లెక్కచేయని పోరాట యోధుడిగా ఎదగడం అసాధారణమైన విషయం.

1951లో సాయుధ పోరాట విరమణ ప్రకటన వెలువడినప్పటికీ, నరసింహులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు వెంటనే ముగియలేదు. చివరకు 1959 జనవరి 26న సుదీర్ఘ జైలు జీవితం నుంచి విడుదలయ్యారు. ఆయన జైలు జీవితం కేవలం వ్యక్తిగత కష్టాల చరిత్ర కాదు. ఒక సామాజిక వ్యవస్థ మార్పు కోసం పోరాడిన వ్యక్తి ఎదుర్కొన్న త్యాగాల చరిత్ర. నరసింహులు పోరాట జీవితాన్ని ప్రస్తావించేటప్పుడు ఆయన భార్య వజ్రమ్మ త్యాగాన్ని విస్మరించలేం. భర్తతో పాటు అజ్ఞాత జీవితం గడిపారు. ఉద్యమంలో భాగస్వామిగా నిలిచారు. జైలు జీవితాన్ని అనుభవించారు. ఆమె జైలులో ఉన్న సమయంలోనే ఒక ఆడ శిశువుకు జన్మనివ్వడం ఆ కుటుంబం ఎదుర్కొన్న విషాద పరిస్థితులకు నిదర్శనం. ఒకవైపు భర్త ప్రజా పోరాటం, మరోవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకోవైపు నిర్బంధ జీవితం. ఇన్ని కష్టాల మధ్య కూడా వజ్రమ్మ తన సహచరి ఆశయాలకు అండగా నిలిచారు. వారి జీవితాలు వ్యక్తిగత సుఖసంతోషాల కంటే ప్రజా ప్రయోజనాలకే అంకితమైన అరుదైన దాంపత్యానికి ప్రతీకలు.

ఆ దంపతులకు ముగ్గురు అడ బిడ్డలు అందులో ఒకరు మరణించారు. తండ్రి అశయాలను అతని బిడ్డ అరుణమ్మ కొనసాగిస్తున్నది.

నల్లా నర్సింహులు పోరాట చరిత్రను భావితరాలకు అందించిన రచయిత కూడా. తను కేవలం పోరాట యోధుడే కాదు తాను జీవించిన కాలాన్ని, అనుభవించిన సంఘటనలను భావితరాలకు అందించాలనే తపన కలిగిన చరిత్రకారుడు కూడా. 1987లో తెలంగాణ సాయుధ పోరాటం నలభైవ వార్షికోత్సవం సందర్భంగా తన అనుభవాలను విస్తృతంగా నమోదు చేశారు. ఆ రచన 1989లో 'తెలంగాణ సాయుధ పోరాటం - నా అనుభవాలు' అనే పుస్తకంగా వెలువడింది. ఆ పుస్తకం ద్వారా తెలంగాణ రైతాంగ పోరాటంలోని అనేక చారిత్రక సంఘటనలు, అమరుల త్యాగాలు, ప్రజల పోరాట పటిమ భావితరాలకు పరిచయమయ్యాయి.

ఇది ఆయన జీవితంలో మరో గొప్ప విజయంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వేలాది మంది ప్రాణత్యాగాలకు సాక్ష్యంగా నిలిచింది. ఆ పోరాట ఫలితంగా భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెరిగింది. లక్షలాది ఎకరాల భూమి పేద రైతుల చేతుల్లోకి వెళ్లడానికి ఉద్యమం దోహదపడింది. నరసింహులు జీవితమంతా ఈ పోరాట స్ఫూర్తిని తనలో నిలుపుకున్నారు. చివరి శ్వాస వరకు ఉజ్వలమైన తన ఆశయాలను, సహచరుల త్యాగాలను స్మరించుకుంటూ జీవించారు. 1993 నవంబర్ 5న ఆయన భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన పోరాట స్ఫూర్తి మాత్రం చరిత్రలో సజీవంగా నిలిచిపోయింది.

నల్లా నరసింహులు జీవితం మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది.

పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని, చదువుకున్న తరగతులకే చరిత్రను సృష్టించే అవకాశం పరిమితం కాదని, సామాజిక చైతన్యం, ధైర్యం, నిబద్ధత ఉంటే ఒక సామాన్యుడు కూడా అసామాన్య చరిత్రను నిర్మించగలడని ఆయన జీవితం నిరూపించింది. అధికారం ముందు తలవంచని ఆత్మగౌరవం, అన్యాయం ముందు మౌనం వహించని పోరాట పటిమ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చే త్యాగనిరతి ఆయన వ్యక్తిత్వంలో కనిపించే విశిష్ట లక్షణాలు.అవే అతన్ని చిరస్మరణీయునిగా చేసినవి. నేటి తరానికి ఆయన జీవితం ఒక చారిత్రక పాఠం. సమాజంలోని అసమానతలను ప్రశ్నించే చైతన్యానికి ఒక స్ఫూర్తి. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసే ఒక సందేశం. ఆయన జీవితం ఒక పోరాటం. ఆయన ప్రయాణం ఒక చరిత్ర. ఆయన త్యాగం ఒక స్ఫూర్తి. ఆయన ఆశయం భావితరాలకు ఒక మార్గదర్శకం. నల్లా నరసింహులు వంటి మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం, వారి పోరాట వారసత్వాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

నల్లా నర్సింహులు

భౌతికంగా దూరమైనా భావజాలంలో చిరంజీవి. ప్రజా పోరాట చరిత్రలో అజరామరుడు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో

నల్లా నరసింహులు తెలంగాణ టైగర్ గా ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయాడు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వాతంత్రం లేక నిత్య నిర్బంధంలో పోరాటం చేసి ప్రజలకు ఎన్నో హక్కులను సాధించిన నల్ల నర్సింహులు స్ఫూర్తితో నేటి ప్రజాస్వామ్య దేశంలో బి.సి ల వాటా సాధించడానికి ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముంది.

(నవంబర్ 5న నల్ల నర్సింహులు 33వ వర్ధంతి)



... సుధీర్ వలుస
న్యాయవాది, వరంగల్
9908763710

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి..

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లి
- బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- ప్రతి బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో ప్లెక్సీలు ఏర్పాటు చేయాలి
- బీపీటీ, కేఎన్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రూ.79
- నిబంధనలు ఉల్లంఘిస్తే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తాం
- బియ్యం ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి , నవంబర్- 04 (భద్రాద్రిన్యూస్):

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం (జుంంవఱ్ఱుశ్రీ జశీఎఎశీఎఱ్ఱవం ౫ౌమ్) ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
గురువారం
5 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

అకాల వర్షం.. అన్నదాత ఆశలపై నీళ్లు!

- చేతికొచ్చిన వరి పంట నేలపాలు..

నాయకులగూడెంలో రైతులకు అపార నష్టం

- పెట్టుబడి, శ్రమ వర్షార్పణం.. దెబ్బతిన్న పంటలను చూసి కన్నీరుమున్నీరవుతున్న రైతులు



సుజాతనగర్, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): అకాల వర్షం అన్నదాత ఆశలపై నీళ్లు చల్లింది. కష్టపడి సాగు చేసి, పంట చేతికొచ్చే సమయంలో కురిసిన భారీ వర్షానికి వరి పంట నేలకొరిగింది. నాయకులగూడెం గ్రామంలో వర్షం ప్రభావంతో పంట పొలాలు నీటమునిగి, వరి వెన్నులు నేలవాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారంగా మారగా, పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులతో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

- అంతర్‌జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు!

- ఐదు నెలలుగా వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల అరెస్ట్

- ముఠా నాయకుడిని పట్టుకున్న ఖమ్మం సీసీఎస్ పోలీసులు..

కారు, 50 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి స్వాధీనం



ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా ఆట కట్టించారు ఖమ్మం సీసీఎస్ పోలీసులు. గత ఐదు నెలలుగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ముఠా నాయకుడు చల్లా వెంకటేశ్వర్లును పట్టుకుని బంగారం, వెండి ఆభరణాలతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం సీసీఎస్ ఏసీపీ ఎండీ సర్వర్, ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు చాకచక్యంగా దర్యాప్తు నిర్వహించి ఈ ముఠాను పట్టుకున్నాయి. ఈ ముఠాకు చెందిన వేములవాడ జీవన ప్రకాష్, పాయం నవీన్‌లను గతంలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా ముఠా నాయకుడైన చల్లా వెంకటేశ్వర్లును కూడా అరెస్ట్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం వైరా పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:

ఒక హ్యుందాయ్ కారు.

50 గ్రాముల బంగారు ఆభరణాలు.

400 గ్రాముల వెండి వస్తువులు.

ఇదీ దొంగల ముఠా నేర విధానం!

జల్సాలకు అలవాటు పడిన నిందితులు పగటిపూట కారులో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించేవారు. అనంతరం రాత్రి వేళల్లో ఆ ఇళ్లలోకి చొరబడి విలువైన బంగారు, వెండి వస్తువులను దొంగిలించేవారు. దొంగిలించిన వస్తువుల్లో కొన్నింటిని బయట మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో విలాసాలకు ఖర్చు చేసేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. వైరా, ఏన్కూరు, కల్లూరు, కారేపల్లి, కురవి, మహబూబాబాద్ ప్రాంతాల్లో ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దొంగల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఖమ్మం సీసీఎస్ పోలీసు సిబ్బందిని అడిషనల్ డీసీపీ రామానుజం ప్రత్యేకంగా అభినందించారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువుల భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (TSEEU 327 INTUC) రీజనల్ కమిటీ నియామకాలు.

- యూనియన్ రీజనల్ కమిటీ కార్యదర్శిగా అచ్చ కోటిలింగం..



పాల్వంచ, నవంబర్04 (భద్రాద్రి న్యూస్): ఇంటెక్ (INTUC) అనుబంధ సంఘమైన తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (TSEEU 327) 7వ దశ రీజనల్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కమిటీకి సంబంధించి కీలక నియామకాలు చేపట్టడం జరిగింది. యూనియన్ రీజనల్ కమిటీ కార్యదర్శిగా అచ్చ కోటి లింగం నియమితులు కాగా, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వలపు యాకయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులను సీ-ఈ (జజు) శివ రాంరెడ్డికి ఘనంగా పరిచయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు ఎం.ఏ. మజీద్, సాదం రామకృష్ణ రావు, చిరుతాని సాయి బాబు, జాల కరుణాకర్ రెడ్డి, దానం నరసింహారావు, ఆర్. అప్పారావు, ఎన్. కోటి, డోలు శ్రీనివాస్, జూనీ, షఫీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలిపారు.

మలపై దండయాత్ర.. ఇంటింటా మందు పిచికారీ!

- గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు

- ఇళ్లతో పాటు పశువుల పాకల్లోనూ దోమల మందు పిచికారీ.. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన





వాజేడు, నవంబర్ 4 భద్రాద్రి న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో దోమల బెడదను అరికట్టి, ప్రజలను సీజనల్ వ్యాధుల నుంచి రక్షించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగారం గ్రామపంచాయతీ జంగాలపల్లిలో ఇంటింటా దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ బోదిబోయిన స్వరూప ఆధ్వర్యంలో, వాజేడు వైద్యాధికారి యోషిత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇళ్లలోనే కాకుండా ఆవుల పాకలు, మేకల పాకల్లో కూడా దోమల మందు పిచికారీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఇదిలా ఉండగా, రేపు బాలికల వసతి గృహంలో కూడా దోమల మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యోషిత, హెచ్‌ఈఓ కోటిరెడ్డి, హెచ్‌వీ వెంకటరమణ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, శాంతకుమారి, దేవి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమార్కుల చెరవీడని ముచ్చర్ల పంచాయతీ ఆస్తులు

- చివరకు బస్టాండ్ ను కూడా వదలని అక్రమార్కులు

- అధికారులు నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్న వైనం





కామేపల్లి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోగల ముచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా సంక్షేమానికి, గ్రామాభివృద్ధికి ఉపయోగపడాల్సిన అత్యంత విలువైన గ్రామ పంచాయతీ భూములు, 'గ్రామకంఠం' స్థలాలు అక్రమార్కుల గుప్పిట్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. గ్రామపంచాయతీకి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడిందని భద్రాద్రి న్యూస్ పత్రికల్లో వచ్చిన కథనాలు రావడంతో స్పందించిన అధికారులు అక్రమార్కులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప అనేక రకాల లీజు షాపుల పన్ను రూపంలో రావాల్సిన నిధులు గ్రామపంచాయతీకి ఒరిగింది ఏమీ లేకుండా పోయింది.ఈ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత 15 సంవత్సరాలుగా గ్రామపంచాయతీకి రూపాయి పన్ను కూడా చెల్లించకుండా పంచాయతీ స్థలాలను ఆక్రమించి, యథేచ్ఛగా వాటర్ ప్లాంట్,షాపింగ్ షెడ్లు,చికెన్ షాపులు ఏర్పాటు చేసుకుని లక్షల్లో రూపాయల వ్యాపారాలు కొనసాగిస్తున్నారుగ్రామ పంచాయతీ ఖజానాకు రావాల్సిన వేలాది రూపాయల ప్రజాధనాన్ని అడ్డగోలుగా ఎగ్గొడుతున్న అక్రమ నిర్వాహకులు, పంచాయతీ నోటీసులు ఇచ్చినా కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ఈ గ్రామ కూడలి ప్రధాన బస్టాండ్ షెడ్‌ను సైతం అక్రమార్కులు ఆక్రమించి వ్యాపార సముదాయాలుగా మార్చుకున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించడానికి కనీస స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, గ్రామస్తులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీకి చెందిన గ్రామకంఠం భూమిని ఆక్రమించి గత 15 సంవత్సరాలుగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఇలా చాలామంది వ్యాపారులు పంచాయతీ ఆస్తులను వాడుకుంటున్నారని,కనీసం పంచాయతీకి ఆదాయం రూపాయి చెల్లించడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఇంత జరుగుతున్నా పాలకవర్గం, అధికారులు ఇప్పటివరకు నామమాత్రపు నోటీసులకే పరిమితమై చేతులు ముడుచుకుని కూర్చోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అధికారులు కాలయాపన చేయకుండా, కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదని,అక్రమ షాపులను వెంటనే తనిఖీ చేసి సీజ్ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. దీనిపై మండల పంచాయతీ అధికారి వి.వి.ఎస్. శాస్త్రిని వివరణ కోరగా... ముచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్,వాటర్ ప్లాంట్ వ్యవహారంపై సర్పంచ్, కార్యదర్శితో చర్చించి ల్యాండ్ డాక్యుమెంట్లు పరిశీలించడం జరిగిందని తెలిపారు.తమ విచారణలో పంచాయతీ స్థలాలలో షాపుల ఏర్పాటు,ఆక్రమ నిర్మాణాలు వాస్తవమేనని తేలిందన్నారు. వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులు గత 10 సంవత్సరాల నుంచి పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులను ఇంతవరకు చెల్లించలేదనే విషయం స్పష్టంగా బయటపడిందని వెల్లడించారు. ఎగవేసిన పన్నులను వడ్డీతో సహా చెల్లించేలా కఠిన చర్యలు చేపడతామని, త్వరలోనే 'గ్రామసభ' నిర్వహించి దీనిపై ముందడుగు వేస్తామని ఆయన వెల్లడించారు.

కిసాన్ ఆల్ ఇండియా మహాసభలకు యువకులు సిద్ధం

- కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామం నుంచి వాలంటీర్లుగా ఎంపిక

- మహాసభల నిర్వహణలో భాగస్వాములయ్యేందుకు ముందుకు వచ్చిన గ్రామస్తులు



కామేపల్లి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్): కిసాన్ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామానికి చెందిన పలువురు వాలంటీర్లుగా సిద్ధమవుతున్నారు.మహాసభల నిర్వహణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేర్లు నమోదు చేసుకున్నారు. మహాసభలకు వచ్చే రైతులు, ప్రతినిధులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం, సభా ప్రాంగణంలో ఏర్పాట్ల నిర్వహణ,ఇతర బాధ్యతలను సమన్వయంతో చేపట్టేందుకు వాలంటీర్లు సిద్ధమవుతున్నారు.రైతాంగ సమస్యలు, హక్కుల కోసం నిర్వహించే ఈ మహాసభల్లో గ్రామం నుంచి భాగస్వాములవడం పట్ల వారు ఆసక్తి చూపుతున్నారు. కిసాన్ ఆల్ ఇండియా మహాసభలు విజయవంతం కావాలని వాలంటీర్లు ఆకాంక్షిస్తున్నారు.ఈ కార్యక్రమంలో బాబు అచ్చయ్య రాంబాబు పవన్ వీరభద్రం వెంకటరమణ సాంబయ్య సతీష్ చిన్న సైదులు నాగేంద్ర కొండలు పాశం సంపత్ శివరాత్రి అభి బాబు అశోక్ రాజేష్ వెంకటేష్ పెద్ద వెంకటేష్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు గ్రామ పెద్దల సమక్షంలో ఒకటైన ప్రేమ జంట



కామేపల్లి, నవంబర్ 4 (భద్రాద్రి న్యూస్):- వారు ?గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు ఇద్దరు కలిసి పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. కానీ అంతలో ప్రియుడు వివాహానికి నిరాకరించడంతో ప్రియురాలు పోలీసులను ఆశ్రయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది.?స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి మండలం లోని గోవింద్రాల గ్రామానికి చెందిన ఆంగోత్ అభిరామ్ అదే గ్రామానికి చెందిన భూక్య స్పందన కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు.ప్రేమ పెళ్లికి కుటుంబ సభ్యులతో పాటు ప్రియుడు అభ్యంతరం తెలపడంతో ప్రియురాలు స్పందన కామేపల్లి పోలీసులను ఆశ్రయించింది.? పోలీసులు ఇరువర్గాలను పిలిసి కౌన్సిలింగ్ నిర్వహించి ఒప్పించారు. అనంతరం తాళ్లగూడెం గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ తల్లి దేవాలయం వద్ద ఇరువర్గాల పెద్దల సమక్షంలో ప్రేమ జంటకు వివాహం జరిపించడంతో కథ సుఖాంతమైంది.



వృద్ధులకు చేయూత

- బహుజన అభ్యుదయ సేవా సమితి, హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు సరుకులు పంపిణీ

వైరా, నవంబర్ 4, (భద్రాద్రి న్యూస్) వైరా నియోజకవర్గ మండల పరిధి గన్నవరం గ్రామంలో మంగళవారం గన్నవరం గ్రామంలో బహుజన అభ్యుదయ సేవా సమితి, హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు కిరాణా సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి గన్నవరం గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా వృద్ధులకు, వితంతువులకు పలుమార్లు నిత్యవసర సరుకులు, స్వెటర్స్, దుప్పట్లు అందించామని తెలిపారు. అంతేకాకుండా ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న పేద పిల్లలకు సాయంకాలం వేళలో ఉచితంగా ట్యూషన్ నిర్వహించి స్నాక్స్ ను అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సమస్త అధ్యక్షులు ఆదూరి మణి మాట్లాడుతూ మునుముందు మా సంస్థ ద్వారా గన్నవరంలో ఉచిత టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నామని ఇప్పటికే వైరా మండలం



కేంద్రంలో ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. మేము చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలకు సామాజిక కార్యకర్తలు, సహాయం చేయాలనుకునే దాతలు, ముందుకు వచ్చి మాకు సహకారం అందించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో పర్స రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో రైస్ షాపుల తనిఖీ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : కమీషనర్ సివిల్ సప్లైస్, హైదరాబాద్ ఆదేశాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని కొత్తగూడెం పట్టణంలో వివిధ బియ్యం విక్రయించే దుకాణాల ను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మరియు జిల్లా మేనేజర్ (సివిల్ సప్లయ్), డిప్యూటీ తాసిల్దార్లు శంకర్ రావు (కొత్తగూడెం), జి.ప్రభాకర్ (మణుగూరు), జి. రాజులు (అశ్వారావుపేట) మరియు ఎం. రాజేశ్వరరావు (భద్రాచలం) వారు తనిఖీలు నిర్వహించి ప్రతి దుకాణం యందు ధరల పట్టికను పెట్టి అట్టి పట్టికలో నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులకూ విక్రయించే విధముగా ఆదేశాలు జారీ చేయటం జరిగింది. దీనిని అతిక్రమించిన యెడల నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 6ఎ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించటం జరిగినది. ఆదే విధముగా వినియోగదారులు కూడా ఎవరైనా బియ్యం దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించి నట్లు అయితే సివిల్ సప్లైస్ అధికారుల కు పిర్యాదు చేయ వలసినదిగా వినియోగదారులకు కోరారు మరియు జిల్లలోనీ మిగత రైస్ దుకాణదారులు అందరు కూడా ధరల పట్టిక ను ఏర్పాటు చేసి, ఆయా ధరల ప్రకారం విక్రయించవలసినదిగా ఆదేశించినారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ డిమాండ్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెం కార్పొరేట్: సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య మాట్లాడుతూ... గత ఏడాది ఆగస్టు 28న యాజమాన్యంతో కుదిరిన ఒప్పంద హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. నిలిపివేసిన మెడికల్ బోర్డులను వెనక్కు పునరుద్ధరించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించి అర్హులైన డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని వర్తింపజేయడంతో పాటు, గనుల్లో రక్షణ పరికరాలు, యంత్రాల విడిభాగాలను తక్షణమే సరఫరా చేయాలన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోల నుంచి సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చొరవ తీసుకుని ఇప్పించాలని



డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంగ వెంకట్, ఎస్.వి. రమణమూర్తి, జక్కుల గట్టయ్య తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా నవంబర్ నెల అంతా "మీ డబ్బు -- మీ క్లిక్ -- మీ ఎంపిక" అనే నినాదంతో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పకూడదన్నారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలి లేదా ఎఇఇఎఎఎఎతీఇతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ నరేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, ఎస్సై జుబేదా బేగం మరియు సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో భారీ వర్షాలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ప్రమాదాల నివారణకు పోలీసులు ఆయా రహదారులపై రాకపోకలను నిలిపివేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్న రహదారులపై ప్రయాణించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించకూడదని హెచ్చరించారు. పశువుల కాపరులు పశువులను వాగులు, వంకలు, నదుల సమీప ప్రాంతాలకు తీసుకెళ్లకూడదని, పొంగిప్రవహిస్తున్న నీటి ప్రవాహాలను దాటించే ప్రయత్నం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రాంతాలు, చెరువులు, వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద నీటిలో రహదారులు దాటేందుకు ప్రయత్నించడం, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు చేపడుతున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించాలని భారీ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడమే నా లక్ష్యం

- వనజీవి విశ్వామిత్ర చౌహాన్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో 1616వ మొక్కగా పింక్ పనస మొక్క నాటిన వనజీవి విశ్వామిత్ర చౌహాన్, పర్యావరణ పరిరక్షణే తన బాధ్యతగా భావిస్తూ ప్రతిరోజూ "వాక్ ఫర్ ట్రీస్" కాన్సెప్ట్ తో మొక్కలు నాటుతున్న విశ్వామిత్ర చౌహాన్, ఈ కార్యక్రమంలో టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వామిత్రతో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా విశ్వామిత్ర చౌహాన్ మాట్లాడుతూ... "స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడమే నా జీవిత లక్ష్యం. చెట్టు నాటడం అంటే కేవలం మొక్క నాటడం కాదు, భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించడం. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్క మొక్క నాటినా చాలు, మన భూమి మళ్లీ పచ్చగా మారుతుంది" అని అన్నారు. కార్యక్రమంలో పునకుల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బాదావత్ శ్రీహరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాస్, బండి భాస్కర్ పాల్గొన్నారు.



మహిళా కండక్టర్ మృతికి కారణమైన వారిని శిక్షించాలి

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : చిల్లర విషయంలో ప్రయాణికురాలు బస్ నుండి తోసేయగా బస్ ప్రమాదంలో మహిళా కండక్టర్ మృతి పట్ల ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. పది రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో మణుగూరు డిపో కండక్టర్ ప్రవళిక బస్ కింద పడి గాయాలపాలైంది. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచింది. ఆమె మృతికి సంతాపంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ ఉద్యోగులు బంద్‌కు పిలుపునిచ్చారు. అన్ని డిపోల్లో కార్మికులు వర్షంలో నిరసన తెలిపారు. డిపోల నుండి బస్సులను కదలనివ్వలేదు. ఆమె మృతికి కారణం అయిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయా డిపో మేనేజర్లు ప్రవళిక చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

ముసురుతో ఉప్పొంగుతున్న వాగులు..

- నిలిచిన రాకపోకలు





కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలో వాగులు ఉప్పొంగుతున్నాయి. పెనుబల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోధుమ వాగుతోపాటు పెనగడప--ములుగుగూడెం వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులపై ఉన్న బ్రిడ్జిల మీదుగా నీరు పారుతుండటంతో ఆయా గ్రామాల నుంచి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి ప్రమాదకరంగా మారడంతో పెనుబల్లి వాగు వద్ద స్థానికులు అప్రమత్తమయ్యారు. ఎవరూ వాగు దాటేందుకు ప్రయత్నించకుండా బ్రిడ్జిపై అడ్డంగా ట్రాక్టర్‌ను నిలిపి రాకపోకలను నియంత్రిస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో వాగు దాటడం ప్రమాదకరమని హెచ్చరిస్తూ ప్రజలను అడ్డుకుంటున్నారు. వాగులపై రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలు సరఫరా చేసేవారు, నిత్యావసర సరుకుల కోసం పట్టణానికి వెళ్లేవారు, కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కొనసాగుతుండటంతో వాగుల్లో వరద ప్రవాహం ఎప్పుడు తగ్గుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వరద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు వరద ప్రవాహం తగ్గే వరకు ఎవరూ వాగులు దాటకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతికి కొత్తగూడెం డిపోలో నివాళి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 04 (భద్రాద్రి న్యూస్) : మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక మృతి, గత నెల 25వ తేదీన ప్రయాణికురాలితో చిల్లర విషయంలో వివాదం నెలకొన్న సమయంలో ప్రయాణికురాలు నెట్టి వేయడంతో బస్సు కింద పడి గాయాలపాలైన ప్రవళిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రవళిక మృతి. చెందినా విషయం పాఠకులకు విదితమే. ఆమె మృతిపట్ల కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో ప్రవళిక చిత్రపటానికి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మితో పాటు ఆర్టీసీ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... కండక్టర్ ప్రవళిక పట్ల జరిగిన ఘటన దురదృష్టకరమని, గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.